సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 29 । మే । 2024


కనకమహాలక్ష్మీ నమోస్తుతే.. 8లో


కేజీహెచ్‌కు కారు వితరణ 8లో


యోగా మాస్టర్ కళాధర రావు వరల్డ్ రికార్డ్ 8లో

న్యూస్‌రీల్

అప్పన్నకు రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం

28 రోజులకు గానూ రూ. 2.60 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం లభించింది. సింహగిరిపై యాత్రి కసదన్‌లో మంగళవారం స్వామివారి హుండీల ఆదాయం లెక్కించారు. 28 రోజులకుగానూ రూ.2,60,71,617 వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సగటున రోజుకు రూ.9,31,129 వచ్చినట్టు పేర్కొన్నారు. నగదుతో పాటు 116.200 గ్రాముల బంగారం, 20.540 కిలోల వెండి లభించినట్టు తెలిపారు. లెక్కింపులో దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. ఇంకా హుండీలు మిగిలిపోవడంతో బుధవారం కూడా ఆదాయాన్ని లెక్కించనున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



ఎస్‌పీడీ కేంద్రంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షకు 23,101 మందికి గానూ 22,276 మంది (96శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండ్ ఇయర్ పరీక్షకు 3,206 మందికి గానూ 2,980 మంది(93 శాతం) హాజరైనట్లు ఆర్‌ఐవో పి.మురళీధర్ తెలిపారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఎండల తీవ్రత దృష్ట్యా అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ఆర్‌ఐవో తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

బెస్ట్ వేల్యూ యూనివర్సిటీ ర్యాంకింగ్‌లో ఏయూకు స్థానం



వీసీ ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్‌కు ఉత్తర్వులు అందిస్తున్న ఆచార్య ధనుంజయరావు

ఏయూక్యాంపస్ : బెస్ట్ వేల్యూ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ ఇన్ ఏసియాలో ఏయూకు మెరుగైన స్థానం లభించింది. ఆసియాలోని 20 దేశాల్లో 3,349 ఉన్నత విద్య అందించే విశ్వవిద్యాలయాలను అధ్యయనం చేసి ఈ స్థానాలను ప్రకటించారు. ఏయూ అత్యుత్తమమైన వర్సిటీల్లో టాప్ 300లో నిలిచింది. అకడమిక్ క్వాలిటీ, విద్య సంబంధిత అంశాలను పరిశీలించి ఈ ర్యాంకింగ్ అందించినట్లు నిర్వాహకులు ప్రకటించారు. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌కు అందజేశారు.

అప్పన్న సన్నిధిలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న నీరభ్‌కుమార్ ప్రసాద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

బడిలో పసందైన భోజనం

- తాజ్ హోటల్ చెఫ్‌ల ఆధ్వర్యంలో వంటల తయారీపై శిక్షణ
- మండల స్థాయిలో ఏజెన్సీల వారికి వంటల పోటీలు
- 587 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు
- పాఠశాలకు వచ్చే విద్యార్థులంతా భోజనం తినేలా ఏర్పాట్లు



గాజువాక మండలం మిందిలో శిక్షణకు హాజరైన వంట ఏజెన్సీలు, ట్రైనర్స్



మిందిలో వంట తయారు చేస్తున్న నిర్వాహకురాలు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న గోరుముద్ద(మధ్యాహ్న భోజనం)ను విద్యార్థులకు మరింత రుచిగా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జూన్ 12న పాఠశాలలు తెరుస్తున్నందున విద్యార్థులకు నాణ్యమైన చదువులతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసేలా ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా మధ్యాహ్నం భోజనం వండే ఏజెన్సీల వారికి మరింత రుచిగా వంట ఎలా తయారు చేయాలనే దానిపై శిక్షణ ఇచ్చింది. మండల స్థాయిలో ఎంపిక చేసిన కొంత మందికి విజయవాడలోని తాజ్ హోటల్ చెఫ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వగా.. అక్కడ శిక్షణ పొందిన వారు మండల స్థాయిలో వంట ఏజెన్సీల వారికి మెలకువలు నేర్పించారు. సోమవారం ఆనందపురం, గాజువాక, పెందుర్తి, పద్మనాభంలో, మంగళవారం పెద గంట్యాడ, చినగదిలి, భీమునిపట్నం, విశాఖ అర్బన్‌లో శిక్షణ శిబిరాలు జరిగాయి.

విద్యార్థులు మైమరిచి తినేలా వంటకం

జిల్లాలో 11 మండలాల్లోని 587 పాఠశాలల్లో వంట తయారీలో పాల్గొంటున్న 1,019 మంది కుక్ కమ్ హెల్పర్లను ఈ ప్రత్యేక శిక్షణలో భాగస్వాములను చేశారు. విద్యార్థులకు ప్రతి రోజూ రుచికరమైన వంటకాలు తయారు చేసి పెట్టేలా తర్ఫీదు ఇచ్చారు. ఇందులో భాగంగా నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి.. ఆహా అనిపించే వంటకం తయారు చేసిన వారికి బహుమతులు అందజేశారు. శిక్షణను విజయవంతం చేసేలా జిల్లాలో మధ్యాహ్న భోజనం పథకం కార్యక్రమాన్ని పర్యవేక్షించే విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ జ్యోతి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. శిక్షణ కార్యక్రమాలను ఆమె స్వయంగా పర్యవేక్షించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

విద్యార్థులంతా భోజనం తినేలా..

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని 587 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తుండగా.. 87,500 మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇందులో 388 పాఠశాలల్లోని 47,010 మంది విద్యార్థులకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనం అందిస్తున్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు గల విద్యార్థులు 99 శాతం మేర బడిలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. కానీ అప్పర్ ప్రైమరీలో 81 శాతం, హైస్కూల్లో చదివే విద్యార్థులు 78 శాతం మంది భోజనం తింటున్నారు. ఈ లెక్కన కొంతమంది ఇంకా ఇళ్ల వద్ద నుంచే బాక్సులు తెచ్చుకుంటున్నారని ఉన్నతాధికారుల పరిశీలనలో తేలింది. దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం బడికి వచ్చే విద్యార్థులంతా కచ్చితంగా గోరుముద్ద పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.

వంట నిర్వాహకులకు గుర్తింపు

విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించడంతో పాటు పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 664 మంది ఆయాలను నియమించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఆయాల నియామకం జరిగింది. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేల వేతనం చెల్లిస్తున్నారు. జిల్లాలో 1,019 మంది వంట నిర్వాహకులు పనిచేస్తుండగా, వీరికి టీడీపీ హయాంలో నెలకు రూ.1000లను మాత్రమే ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వీరి గౌరవ వేతనం రూ.3 వేలకు పెంచింది.

ఇదీ మెనూ

- సోమవారం: హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు/ పలావ్‌తో ఎగ్ కర్రీ, వేరుశనగ చిక్కీ
- మంగళవారం: దొండకాయ చట్నీతో చింతపండు పులిహోర, ఉడికించిన గుడ్డు
- బుధవారం: కూరగాయల అన్నం, బంగాళదుంప కూర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
- గురువారం: సాంబార్ బాత్ లేదా టమాటా చట్నీతో నిమ్మకాయ రైస్, ఉడికించిన గుడ్డు
- శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
- శనివారం: ఆకుకూర అన్నం, పప్పు చారు



పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో జరిగిన శిక్షణలో మాట్లాడుతున్న ఏడీ అరుణ జ్యోతి

కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్ల పరిశీలన



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో జరుగుతున్న ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున మంగళవారం పరిశీలించారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం, పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపునకు అనుగుణంగా ఆయా నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ కేంద్రాల్లో 14 చొప్పున టేబుళ్లు, ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ కూర్చునే విధంగా కుర్చీలు వేశారు. రిటర్నింగ్ అధికారి, ఇతర అధికారులు పర్యవేక్షించేందుకు అనుగుణంగా మరొక టేబుల్ కూడా కౌంటింగ్ కేంద్రం లోపల ఏర్పాటు చేయగా, చుట్టూరా అభ్యర్థులు, ఏజెంట్లకు కనిపించే విధంగా మెస్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ కేంద్రంలో 360 డిగ్రీల సీసీ కెమెరాలు అమర్చుతున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తనిఖీ చేశారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా మంగళవారం ఉదయం స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు వెళ్లిన వారు అక్కడ మూడంచెల భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. అనంతరం లాగ్‌బుక్‌లో సంతకాలు చేశారు.

బాబోయ్..ఉక్కపోత!





సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కొద్ది రోజులుగా జనానికి ముచ్చెమటలు పట్టిస్తోంది. ఉదయం లేచింది మొదలు అర్ధరాత్రి వరకు ఉక్కపోత ఇబ్బంది పెడుతూనే ఉంది. ఎండల తీవ్రత అంతగా లేకపోయినా ఉక్కపోత వాతావరణంతో జనం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విశాఖ నగరంలో 38 డిగ్రీలు, జిల్లాలో 40 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి సాధారణంకంటే 2–3 డిగ్రీలు అధికం. అయినప్పటికీ ఉక్కపోత అధికంగా ఉండడంతో 44 డిగ్రీల ఉష్ణోగ్రత అనుభూతి కలుగుతోంది. సాధారణంగా గాలిలో తేమ 60 శాతం ఉంటే ఉక్కపోత ప్రభావం చూపుతుంది. కానీ విశాఖలో గాలిలో తేమ 76–78 శాతం ఉంటోంది. దీంతో నగర వాసులు తీవ్ర ఉక్కపోతకు గురవుతున్నారు. రానున్న రెండు మూడు రోజులు ఇదే వాతావరణం కొనసాగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అందువల్ల నెలాఖరు వరకు జనం ఉక్కపోత నుంచి ఉపశమనం పొందే అవకాశం లేదు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌పై ఫిర్యాదు

అల్లిపురం: కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ తనను లైంగికంగా వేధించినట్లు ఇటీవల సరెండరైన గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. 2023 జనవరి నుంచి కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ తనను లైంగిక వేధింపులకు గురిచేశారని, కులం పేరుతో దూషించారని ఆరోపించారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ విషయమై వన్‌టౌన్ పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందినట్లు చెప్పారు. కాగా గతంలో ఆమెపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ జరిపి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు సరెండర్ చేసిన విషయం తెలిసిందే.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తి చేసేందుకు పార్టీలు సహకరించాలి
- విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులతో కలెక్టర్ మల్లికార్జున



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున

విశాఖ సిటీ : జిల్లాలోని పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున రాజకీయ పక్షాల అభ్యర్థులకు వివరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పార్లమెంట్‌కు పోటీ చేసిన అభ్యర్థులకు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ఓట్ల లెక్కింపు, కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది నియామకం, ఏజెంట్లు, అభ్యర్థులు పాటించాల్సిన నియమాలు, చట్టపరమైన అంశాలను అభ్యర్థులకు వివరించారు.

పార్లమెంట్ నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఆంధ్రా యూనివర్సిటీ ట్రిపుల్ ఈ బ్లాక్‌లో పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఈవీఎంల్లోని ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ లెక్కించడానికి వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఈవీఎంలకు 104 టేబుళ్లు.. పోస్టల్‌కు 18 టేబుళ్లు

ఈవీఎం ఓట్ల లెక్కింపు కోసం 104 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ కోసం మరో 18 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈసీఐ నిబంధనల మేరకు ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకునే అవకాశం అభ్యర్థులకు ఉందన్నారు. ఈ నెల 31 నాటికి ఏజెంట్ల వివరాలు సమర్పించాలని సూచించారు. వీరు కాకుండా ఆర్‌వో దగ్గర అభ్యర్థి లేదా జనరల్ ఏజెంట్ కూర్చొనే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గాల వారీగా ఏజెంట్ల వివరాలను అందజేస్తే, వారికి వెంటనే గుర్తింపు కార్డు జారీ చేస్తామని చెప్పారు.

తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు

తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభమవుతుందని, 30 నిమిషాల తరువాత ఈవీఎంల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరని స్పష్టం చేశారు. ఏజెంట్లు కౌంటింగ్ గదిలోకి ప్రవేశించిన నుంచి ప్రక్రియ ముగిసే వరకు బయటకు అనుమతించమని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి తాగునీరు, తినుబండారాలను కూడా అనుమతించబోమని తేల్చి చెప్పారు. ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల కల్లా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే కూర్చోవాలని, ఇతర టేబుళ్ల దగ్గరకు, ఇతర నియోజకవర్గాలకు వెళ్లే అవకాశం లేదని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ గుర్తింపు కార్డును విధిగా ధరించాలన్నారు. ఏదైనా అభ్యంతరం ఉంటే రాతపూర్వకంగా సంబంధిత ఆర్‌వోకు లేదా ఏఆర్‌వోకు అందజేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏజెంట్లు ప్రవర్తిస్తే, వారిపై చర్య తీసుకొనే అవకాశం ఆర్‌వోలకు ఉందని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌పై సంతకం, హోదా ఉంటేనే చెల్లుబాటు

పోస్టల్ బ్యాలెట్ కవర్‌లో 13ఏ, 13బీ ఫారాలు ఉంటాయని, వాటిపై కచ్చితంగా ఓటరు సంతకంతో పాటు అధికారి సంతకం, హోదా ఉండాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో ఆ ఓటు చెల్లదని తేల్చి చెప్పారు. చెల్లిన ఓట్లను లెక్కింపులో పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మోహన్ కుమార్, ఇతర అధికారులు, పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసాకు సన్నద్ధం!

- వైఎస్సార్ మత్స్యకార భరోసా లబ్ధిదారుల ఎంపిక
- 13,530 కుటుంబాలు అర్హులుగా గుర్తింపు
- గత ఏడాది కంటే 1,357 మంది ఎక్కువ
- ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జాప్యం
- కోడ్ ఎత్తివేత అనంతరం పంపిణీ చేయనున్న మత్స్యశాఖ



వలలకు మరమ్మతులు చేస్తున్న మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం : మత్స్యకారులకు సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలో ప్రభుత్వం ఇచ్చే భృతికి మత్స్యశాఖ సన్నాహాలు చేస్తోంది. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15వ తేదీ అర్ధరాత్రి వరకు 61 రోజుల పాటు చేపల వేటపై నిషేధం అమలులో ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారులు ఉపాధిని కోల్పోతారు. అందువల్ల వీరికి ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద రూ.10 వేల జీవన భృతిని చెల్లిస్తుంది. గత తెలుగుదేశం హయాంలో ఈ భృతి కేవలం రూ.4 వేలు మాత్రమే ఇచ్చేది. అది కూడా ఆర్నెల్లకో ఏడాదికో పంపిణీ చేసేది. కానీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచింది. అంతేకాదు ఏటా ఈ సొమ్మును వేట విరామ సమయంలోనే అందజేస్తోంది. ఇందుకోసం మత్స్యశాఖ వేట విరామం అమలులోకి వచ్చాక లబ్ధిదార్ల ఎంపిక (ఎన్యూమరేషన్) చేపడుతుంది. అర్హుల జాబితాను రూపొందిస్తుంది. ఆ మేరకు భృతిని వారి బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తుంది. మెకనైజ్డ్ (మర) బోట్లకు ఎనిమిది మంది, మోటారైజ్డ్ బోట్లకు ఆరుగురు, నాన్ మోటారైజ్డ్ బోట్లకు ముగ్గురు చొప్పున (బోటు యజమాని సహా) మత్స్యకార భరోసాకు అర్హులుగా చేస్తారు. విశాఖపట్నం జిల్లాకు సంబంధించి (భీమునిపట్నం నుంచి యారాడ వరకు ఉన్న తీర ప్రాంతంలో) సముద్రంలో చేపలవేట సాగిస్తున్న వివిధ రకాల బోట్లు 2,267 వరకు ఉన్నాయి. వీటిలో 13,530 మందిని వైఎస్సార్ మత్స్యకార భరోసాకు అర్హులుగా విశాఖ జిల్లా మత్స్యశాఖ అధికారులు గుర్తించారు. వేట నిషేధ పరిహారం సొమ్ము నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడానికి వీలుగా ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాల నంబర్లను అధికారులు ఇప్పటికే సేకరించారు.

పంపిణీకి కోడ్ బ్రేక్

మత్స్యకార భరోసా సొమ్ము పంపిణీకి ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. కోడ్ లేకపోతే వేట విరామ సమయంలోనే వీరికి ఈ పరిహారం సొమ్ము అందేది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. అనంతరం కోడ్ ఎత్తివేత ప్రకటన వెలువడ్డాక అర్హులైన మత్స్యకారులకు ఈ సొమ్మును పంపిణీ చేయడానికి మత్స్యశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. విశాఖ జిల్లాలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకానికి అర్హులుగా గుర్తించిన 13,530 మందికి రూ.10 వేల చొప్పున రూ.13.53 కోట్లను అందజేయనున్నారు.

విరామ సమయంలో ఇలా..

చేపల వేట విరామ సమయంలో బోటు యజమానులు తమ బోట్లకు మరమ్మతులు చేయించుకుంటున్నారు. ఇంజిన్ గేర్ బాక్సులు, ఆయిల్, వాటర్, కేబిన్, పంఖాలు, బుష్‌లు వంటి వాటికి రిపేర్లు చేయిస్తున్నారు. కొన్నింటికి రంగులు కూడా వేయించి అందంగా తయారు చేయిస్తున్నారు. అలాగే మత్స్యకారులు వలలకు మరమ్మతులు చేపడుతున్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్

1, 119 మంది హాజరు



కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. కంచరపాలెం పాలిటెక్నిక్, గైస్, పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలల్లో సోమవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మంగళవారం నాటికి ఈ మూడు కళాశాలల్లో 1–27,000 ర్యాంకుల వరకు విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరగ్గా.. 1,119 మంది హాజరయ్యారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ర్యాంకర్లకు రిజిస్ట్రేషన్ ధ్రువీకరణపత్రాలు అందించారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో సోమవారం 237 మంది, మంగళవారం 302 మంది మొత్తం 539మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరిలో 338 మంది బాలురు 201 మంది బాలికలు ఉన్నారు. గైస్‌లో సోమవారం 150 మంది, మంగళవారం 256 మంది, పెందుర్తిలో సోమవారం 69, మంగళవారం 105 మంది తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు.

నేటి కౌన్సెలింగ్ వివరాలివీ..

బుధవారం నిర్వహించే సర్టిఫికెట్‌ల పరిశీలనకు సంబంధించి గైస్‌లో 27,001–35,000, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 35,001–43,000, పెందుర్తిలో 27,001–43,000 ర్యాంకుల విద్యార్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోగా హాజరు కావాల్సి ఉంటుంది. ఎస్టీ విద్యార్థులు కంచరపాలెం పాలిటెక్నిక్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ నారాయణరావు సూచించారు.

క్లుప్తంగా

పీఎఫ్ కమిషనర్ తీరుపై నిరసన


పీఎఫ్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న నాయకులు

విశాఖ విద్య: విశాఖ రీజినల్ పీఎఫ్ కార్యాలయ కమిషనర్ తీరుపై ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పెన్షనర్స్(ఏపీఆర్‌పీఏ) నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌ఏడీ మర్రిపాలెం పీఎఫ్ కార్యాలయం ముందు మంగళవారం వారు ఆందోళన చేశారు. పలు కంపెనీల్లో రిటైర్ అయిన ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై విన్నవించుకునేందుకు కమిషనర్‌ను కలిసే ప్రయత్నం చేసినప్పటికీ, ఆయన నిరాకరించడం సబబు కాదని సంఘం జిల్లా జనరల్ కార్యదర్శి ఎస్కే హుస్సేన్, సంయుక్త కార్యదర్శి కేపీ కుమార్ అన్నారు. పెన్షనర్ల సమస్యలు అనేకం ఉన్నప్పటికీ.. వాటిని చెప్పుకునేందుకు కూడా అధికారులు అనుమతించకపోవడం విచారకరమన్నారు.

పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల నుంచి సరైన స్పందన లేక, పలు భద్రతా పనుల నిమిత్తం కొన్ని రైళ్లు రద్దు చేస్తున్నట్లు మరికొన్ని రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. సంబల్‌పూర్–కాచిగూడ–సంబల్‌పూర్ (08325/08326) మధ్య నడుస్తున్న సమ్మర్ స్పెషల్‌కు ప్రయాణికుల నుంచి సరైన స్పందన లేనందున సంబల్‌పూర్–కాచిగూడ స్పెషల్ రైలు జూన్ 17, 24, కాచిగూడ–సంబల్‌పూర్ స్పెషల్ జూన్ 18, 25వ తేదీల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. లమ్‌డింగ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఈ నెల 31వ తేదీన ఎస్‌ఎంవీ బెంగళూరులో బయల్దేరాల్సిన ఎస్‌ఎంవీ బెంగళూరు–అగర్తలా(12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.







అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కనకమహాలక్ష్మీ నమోస్తుతే

కనులపండువగా అమ్మవారి జాతర

బీచ్‌రోడ్డు: చిన్నవాల్తేరులో కొలువైన శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం కనులపండువగా సాగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య అనుపు ఉత్సవం, అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం క్యూలు, మంచి నీటి సదుపాయం కల్పించింది. అమ్మవారిని విశాఖ ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రసాదం స్వీకరించారు. వైఎస్సార్ సీపీ 21వ వార్డు అధ్యక్షుడు మదుపాక రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. జాతరలో ముస్లింలు భాగమయ్యారు. 'కులం.. మతం కాదు.. మనమంతా భారతీయులం.. అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి' అనే నినాదంతో మొహమ్మదియా మసీద్ యూత్ సభ్యులు భక్తులకు ప్రసాదం, జ్యూస్ పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు.

జీవీఎంసీ టెన్త్ టాపర్‌గా మాధవధార విద్యార్థి


తేజేష్‌రెడ్డి

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన గరికిన తేజేష్‌రెడ్డి అత్యధిక మార్కులు సాధించి జీవీఎంసీ స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. ఇటీవల వెలువడిన 10వ తరగతి ఫలితాల్లో తేజేష్ రెడ్డి 584 మార్కులు సాధించాడు. హిందీలో 89 మార్కులు మాత్రమే రావడంతో రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేశాడు. రీకౌంటింగ్‌లో హిందీలో 99 మార్కులు వచ్చినట్లు తేలింది. దీంతో తేజేష్ రెడ్డి 594 మార్కులు సాధించి జీవీఎంసీ స్థాయిలో టాపర్‌గా నిలిచాడని హెచ్‌ఎం బి.హేమలత తెలిపారు. అతను సాంఘికశాస్త్రంలో 100, గణితంలో 100, తెలుగులో 99, హిందీలో 99, ఇంగ్లిష్‌లో 98, సైన్స్‌లో 98 మార్కులు సాధించాడు.

నేడు రగ్బీ జట్టు ఎంపిక

భీమునిపట్నం: విశాఖ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమిలిలోని వీఎంఆర్డీఏ మైదానంలో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు రగ్బీ జిల్లా జట్టు ఎంపిక జరగనుంది. 2006–2008 మధ్య జన్మించిన వారు ఎంపిక పోటీలకు హాజరుకావచ్చని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.లలిత్‌కుమార్ తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 31న తిమ్మాపురం విజ్ఞాన్ విద్యాలయంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.




పటిష్ట భద్రత.. నిరంతర పహారా

విశాఖ లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్లను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచిన విషయం తెలిసిందే. ఈ స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. నిత్యం కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసులు పహారా కాస్తున్నారు. బయట వ్యక్తులెవ్వరూ ఈ పరిసరాలకు వెళ్లకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉన్నారు. ప్రత్యేకంగా ముళ్ల కంచెను ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు తీసుకున్నారు.

-ఏయూక్యాంపస్

కన్నవారే కడతేర్చారు!

ఏదైనా వ్యాపారం చేసుకోవాలని పెద్ద కుమారుడికి ఆ తండ్రి రూ.6 లక్షలు ఇచ్చాడు. ఈ మొత్తంతో ఏర్పాటు చేసిన రెస్టారెంట్ నష్టాల్లోకి రావడంతో మరింత డబ్బు కావాలని వేధించాడు. ఆపై ఆస్తి పంపకాలు చేయాలని హింసించాడు. వీటి బాధ భరించలేక తన చిన్న కుమారుడితో కలిసి హత్యకు పన్నాగం పన్నారు. రూ.8 లక్షలు సుపారీ ఇచ్చి హత్య చేయించారు. ఆపై పోలీసులకు లొంగిపోయారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ, చిత్రంలో డీఎస్పీ అప్పలరాజు, అనకాపల్లి టౌన్ సీఐ శంకరరావు

- కొక్కిరాపల్లి హత్య కేసులో లొంగిపోయిన సోదరుడు, తండ్రి
- ఆస్తి పంచాలని వేధింపులు భరించలేక ఘాతుకం
- హత్య కేసులో ఏడుగురు నిందితులకు రిమాండ్

సాక్షి, అనకాపల్లి: వి.మాడుగుల మండలం ఎం.కోటపాడుకు చెందిన శానాపతి రామాంజనేయులు(31) హత్య కేసులో పోలీసులు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి మారుతీ స్విఫ్ట్ కారు, 23 గ్రాముల బంగారం, ఆరు మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన కత్తి, రెండు టవళ్లు, నిందితుల నుంచి రూ.77,250 స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను మంగళవారం ఎస్పీ మురళీకృష్ణ మీడియాకు వెల్లడించారు. ఎం.కోటపాడుకు చెందిన శానాపతి నాగరాజు, లక్ష్మి దంపతులకు పెద్ద కుమారుడు రామాంజనేయులు(మృతుడు) తన తండ్రి ఇచ్చిన రూ.6 లక్షలతో స్వగ్రామంలో రెస్టారెంట్ ఏర్పాటు చేశాడు. ఇది నష్టాల్లోకి రావడతో తనకు మరింత డబ్బులు ఇవ్వాలని, ఆస్తులు పంచాలని తల్లిదండ్రులను, సోదరుడితో వివాదం పెట్టుకున్నాడు. ఆ వివాదం పెద్దదై ఆస్తుల పంచడానికి వీలులేదన్న తల్లిదండ్రులను కొట్టడంతోపాటు హింసించేవాడు. దీంతో విసిగిపోయిన వారంతా హత్యకు పథకం వేశారు.

పూటుగా మద్యం తాగించి కారులో హత్య...

ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్న మృతుడు సోదరుడు శివాజీ తన సహోద్యోగి శీలంనేని గోపి(ఏ3)ని సంప్రదించాడు. ఆ మేరకు ఏ3 నిందితుడు గోపి స్నేహితులైన ఏ4–మేడం అంజిరెడ్డి, ఏ5– అందె నాగేంద్రబాబు, ఏ6–ఉప్పుతోట్ల మురళీకృష్ణ, ఏ7–మక్కన శివలతో హత్య చేయడానికి రూ.8 లక్షల సుపారీ మాట్లాడుకున్నారు. వారి ప్రణాళికలో భాగంగా ఈ నెల 20న స్నేహితులకు సోదరుడు శివాజీ తన అన్నయ్య ఇల్లు, ఎం.కోటపాడులో రెస్టారెంట్‌ను చూపించాడు. 21న మధ్యాహ్నం 2 గంటలకు నిందితులు అక్కడ రెస్టారెంట్‌కి వెళ్లి రామాంజనేయులకు పూటుగా మద్యం తాగించి.. ఇంటి వద్ద దింపుతామంటూ కారులో తీసుకెళ్లి మార్గమధ్యంలో కడుపులో కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని యలమంచిలి మండలం కొక్కిరాపల్లి వద్ద చెరువులో పడేసి పరారయ్యారు. ఇందుకుగానూ మృతుని సోదరుడు నిందితులకు రూ.6 లక్షలు ఇచ్చాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 21న మాడుగుల పోలీస్ స్టేషన్లో తన భర్త కనిపించడం లేదని మృతుని భార్య శ్రీదేవి ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో భాగంగా కొక్కిరాపల్లి చెరువులో లభించిన మృతదేహాన్ని ఆమెకు చూపించగా తన భర్తదే అని గుర్తించింది. వైద్యాధికారి ఇచ్చిన పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం హత్యగా ధ్రువీకరించారు.

నేరం అంగీకరించిన తండ్రి సోదరుడు...

ఈ మేరకు ఐదు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు కోసం ఎస్పీ ఆదేశించారు. దర్యాప్తులో భాగంగా మృతుని తండ్రి ఏ2– నాగరాజు, తమ్ముడు ఏ1– శివాజీ, ఏ3– శీలంనేని గోపి సతీష్(ఏ3) వీఆర్వో సమక్షంలో మంగళవారం మాడుగుల పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయి హత్య చేసినట్లు అంగీకరించారు. వీరి ద్వారా హత్య చేసిన మిగిలిన నలుగురు నిందితులను చోడవరం టౌన్ బస్టాండ్ వద్ద అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏడుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తులో పాలు పంచుకున్న అధికారులకు సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలియజేశారు. అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, అనకాపల్లి టౌన్ సీఐ శంకరరావు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు కారు వితరణ

విశాఖ సిటీ: కేజీహెచ్‌లో వృద్ధులు, ఇతర రోగుల సౌకర్యార్థం ఎంవీపీ కాలనీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ బ్యాటరీతో నడిచే 8 సీటర్ కారును వితరణగా అందజేసింది. వేగవంతంగా రోగ నిర్ధారణకు, పోస్టు గ్రాడ్యుయేట్లకు మెరుగైన బోధన కోసం ఈఎన్‌టీ విభాగానికి రెండు ఎండోస్కోప్ యంత్రాలు ఇచ్చింది. వీటిని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రి హెచ్‌వోడీ ప్రొఫెసర్ హరికృష్ణలకు మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ వి.మురళీకృష్ణ అందజేశారు. కార్పొరేటర్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రూ.10 లక్షలతో వీటిని అందజేసినట్లు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. కారుతో పాటు డ్రైవర్‌ను కూడా ఏర్పాటు చేయడం పట్ల కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ మహాత్మాగాంధీ ఆస్పత్రి ఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో పాటు రోగుల సంక్షేమానికి క్యాన్సర్ ఆస్పత్రి యాజమాన్యం కృషి చేస్తోందని కొనియాడారు.

యోగా మాస్టర్ కళాధరరావు వరల్డ్ రికార్డ్

మధురవాడ: యోగా మాస్టర్, మధురవాడకు చెందిన కె.వి.కె.కళాధరరావు మరో వరల్డ్ రికార్డ్‌ను సొంతం చేసుకున్నారు. ఈ నెల 4న గ్లోబల్ వరల్డ్ రికార్డ్ నిర్వహించిన వర్చువల్ పోటీల్లో 59 ఏళ్ల కళాధరరావు 2.40 గంటలు శంఖు ముద్రతో పాటు వజ్రాసనం వేసి ప్రపంచ రికార్డ్‌ను నెలకొల్పారు. దీంతో ఆయన గ్లోబల్ వరల్డ్ రికార్డ్ నుంచి ప్రశంసాపత్రం, ట్రోఫీ అందుకున్నారు. ప్రస్తుతం ఆయన మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నగరంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన్ని ఆర్టీసీ విజయనగరం జోన్ సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ఇతర అధికారులు అభినందించారు.

గురుకులాల్లో మిగుల సీట్ల భర్తీకి స్పందన


విద్యార్థికి ధ్రువీకరణపత్రం అందిస్తున్న సమన్వయాధికారి రూపవతి

కంచరపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి మంగళవారం నిర్వహించిన స్పాట్ కౌన్సెలింగ్‌కు విశేష స్పందన లభించింది. విశాఖ జిల్లా పరిధిలో 3, అనకాపల్లి జిల్లా పరిధిలో 8 గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కంచరపాలెంలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకులాల ఉమ్మడి జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి మాట్లాడుతూ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుగుణంగా 5వ తరగతిలో మొత్తం 71 సీట్లు భర్తీ చేశామన్నారు. బాలికలు 5వ తరగతిలో ప్రవేశానికి బుధవారం తాళ్లపాలెంలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలుర అడ్మిషన్ కోసం 30న సబ్బవరం గురుకులంలో, బాలికల అడ్మిషన్ కోసం 31న మేహాద్రి గెడ్డ గురుకులంలో స్పాట్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు.

టీవీఎస్ శర్మకు 'రంగస్థల కళాభాస్కర' బిరుదు ప్రదానం


టి.వి.ఎస్.శర్మను సత్కరిస్తున్న జీవీఎంసీ కార్యదర్శి పల్లి నల్లనయ్య

సీతంపేట: సుప్రసిద్ధ పౌరాణిక రంగస్థల నటుడు, అనంతపురం జిల్లా వాసి తోటపల్లి వెంకట సూర్యనారాయణ శర్మ(టీవీఎస్ శర్మ)కు మాతా కళాపీఠం 'రంగస్థల కళాభాస్కర' బిరుదును ప్రదానం చేసి.. ఘనంగా సన్మానించింది. జీవీఎంసీ కార్యదర్శి పల్లి నల్లనయ్య ఆధ్వర్యంలో మాతా కళాపీఠంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నల్లనయ్య మాట్లాడుతూ ఓ పక్క వంశపారపర్యంగా వస్తున్న పురోహిత వృత్తిని కొనసాగిస్తూనే.. పౌరాణిక పద్య నాటకాన్ని ముందుతరాలకు చేర్చేందుకు శర్మ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. శ్రీకృష్ణ, శ్రీరామ, నక్షత్ర లాంటి పాత్రల్లో ఎంతో రమ్యంగా నటిస్తూ.. మెప్పిస్తున్న శర్మను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాతా కళాపీఠం అధినేతలు బి.ఎన్.మూర్తి, పల్లి నాగభూషణరావు పాల్గొన్నారు.

ముగిసిన దినత్రయ మాస పారాయణం


దినత్రయ మాస పారాయణంలో పాల్గొన్న భక్తులు

విశాఖ సిటీ: తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో గుళ్లపల్లి దత్తాత్రేయ ఘణపాటి ఆధ్వర్యంలో శ్రీ కనకమహాలక్ష్మి దేవాలయం వద్ద గత మూడు రోజులుగా జరుగుతున్న దినత్రయ మాస పారాయణం మంగళవారంతో ముగిసింది. ఈ నెల 26వ తేదీ నుంచి దిగ్విజయంగా 25 మంది వేద పండితుల సమక్షంలో సంపూర్ణ చతుర్వేద పారాయణం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్చకులు పాణింగపల్లి సునీల్ కుమార్, టీటీడీ స్కీం అథర్వ వేద పారాయణదారు రావూరి సుబ్రహ్మణ్య శర్మ, చిట్టెల సోమేశ్వర శర్మ చవ్వాకుల వెంకటేశ్వరరావు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి నీలిమ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్ సంయుక్తంగా బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఈ మేరకు బొల్లినేని మెడ్ స్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు ఓ ప్రకటన విడుదల చేశారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్/10వ తరగతి పూర్తి చేసిన 18 నుంచి 28 ఏళ్ల వయసు గల పురుషులు, మహిళలు అర్హులన్నారు. అనుభవజ్ఞులైన శిక్షకులతో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఉచితంగా భోజనం, వసతి, యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బీఎస్సీ, డిప్లమో, పారా మెడికల్ కోర్సుల్లో అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు షీలానగర్ కిమ్స్ ఐకాన్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో లేదా 91219 99654, 79930 11605లో సంప్రదించాలని సూచించారు.

2న క్రికెట్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: పోర్ట్ స్టేడియం వేదికగా జూన్ రెండో తేదీన ఒక్క రోజు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నీ ప్రతినిధి గంట్ల శ్రీనుబాబు తెలిపారు. వీజేఎఫ్ కార్యదర్శిగా సేవలందించిన ఎస్.దుర్గారావు స్మారక క్రికెట్ టోర్నీ పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీల్లో నాలుగు జట్లు పాల్గొంటాయని వెల్లడించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పోటీల వివరాలు వెల్లడించారు. జర్నలిస్ట్‌ల జట్లు రెండింటితో పాటు కళాకారుల జట్టు, ప్రొఫెషనల్ వీడియోగ్రాఫర్ల జట్టు తలపడనున్నాయన్నారు. టోర్నీ ప్రతినిధి వాల్మీకి నాగరాజు మాట్లాడుతూ ఆదివారం నాలుగు జట్లతో నాకవుట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు లోకేష్‌కుమార్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో జాగ్రత్త అవసరం

విశాఖ సిటీ : పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో భాగస్వామ్యమయ్యే అధికారులు, సిబ్బంది జాగ్రత్త వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ పరిధిలో పోలైన వివిధ పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపులో అనుసరించాల్సిన విధివిధానాలపై, సహకారం అందించాల్సిన తీరుపై దిశానిర్దేశం చేశారు. సుమారు 22 వేల వరకు ఓట్లు పోలైన నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. ప్రాథమికంగా బ్యాలెట్ ఓట్లను విభజించుకోవాలని, టేబుల్‌కు 500 చొప్పున కేటాయించాలన్నారు. మొత్తం ప్రక్రియ మూడు రౌండ్లలో ముగియనుందన్నారు. ఈటీపీబీఎస్ (సర్వీస్ ఓటర్ల నుంచి పోస్టల్ ద్వారా వచ్చినవి) ఓట్లను స్కాన్ చేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే అధికారులు, సిబ్బంది జూన్ 4న ఉదయం 6 గంటలకే కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, ఎన్‌ఐసీ డీఐవో చంద్రశేఖర్, అసిస్టెంట్ డీఐవో పాషా, కలెక్టరేట్ ఏవో దేవ్ ప్రసాద్,కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	:రూ.120
బ్రాయిలర్ (లైవ్)	:రూ.140
స్కిన్	:రూ.250
స్కిన్‌లెస్	:రూ.250

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	500.00
విజయనగరం	504.00
శ్రీకాకుళం	504.00